ప్రజాశక్తి

గురువారం 7 నవంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

జివిఆర్ ఫ్యాక్టరీలో ఐటి దాడులు

- కార్మికులను బయటకు పంపని వైనం
- రాత్రి కూడా కొనసాగుతున్న తనిఖీలు



ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని పాత శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న జివిఆర్ ఫ్యాక్టరీలో బుధవారం నాడు ఐటీ దాడులు జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఐటీ అధికారులు ఫ్యాక్టరీలో తనిఖీలు చేస్తూనే ఉన్నారు. ఉదయం ఫ్యాక్టరీలోకి వెళ్లిన ఐటీ అధికారుల యంత్రాంగం వెంటనే అక్కడి ఆఫీసులో ఉన్న సిబ్బంది మొత్తం ఫోన్లు స్వాధీనం చేసుకొని.. అక్కడ ఉన్న కంప్యూటర్లలో తనిఖీలు మొదలుపెట్టారు. అక్కడ ఉన్న రికార్డులోని ప్రతి కాగితాన్నీ తనిఖీ చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఐటి అధికారుల బృందం తిరుపతి నుంచి ప్రత్యేక పోలీసు బలగాల రక్షణలో తనిఖీలు చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ భీమవరం మాజీ శాసనసభ్యులు, వైసీపీ నేత గ్రంధి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు చెందింది. ఈ ఫ్యాక్టరీ ద్వారా రొయ్యల ఎక్స్‌పోర్టు చేస్తుంటారు. ఫ్యాక్టరీ పెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ▶ 2లో




రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి

రుచికరంగా పౌష్టికాహారం అందించాలి 8లో

బాపట్ల జిల్లాకు కొత్త రైలు మార్గం

- మచిలీపట్నం-రేపల్లె-బాపట్ల రైల్వే లైన్‌కు మార్గం సుగమం
- రేపల్లె-బాపట్ల రైల్వే లైన్ సర్వే కోసం రూ.1.15 కోట్లు మంజూరు



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో మరో కొత్త రైల్వేలైన్‌కు మార్గం సుగమమైంది. కోస్తా తీర ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం మచిలీపట్నం-రేపల్లె-బాపట్ల కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కోసం సర్వే కోసం కావలసిన నిధులను రైల్వే శాఖ మం జూరు చేసింది. ముందుగా మచిలీపట్నం-రేపల్లె వరకు నూతన రైల్వేలైన్ అనుకున్నప్ప టికీ తుదిగా సదరు లైన్‌ను బాపట్ల వరకు పొడిగించేందుకు రైల్వేశాఖ ఆమోదం తెలి పింది. మచిలీపట్నం-రేపల్లె మధ్య మొత్తం 45.30 కిలోమీటర్ల పొడవైన ఈ నూతన లైన్‌కు సంబంధించిన ఎఫ్‌ఎల్‌ఎస్ (ఫైనల్ లొకేషన్ సర్వే) చేపట్టేందుకు రైల్వేబోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు రైల్వే లైన్ సర్వే కోసం రూ.1.13 కోట్లు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

రేపల్లె-బాపట్ల మధ్య 45.81 కిలోమీటర్ల రైల్వేలైన్ కోసం రూ.1.15 కోట్ల నిధులను రైల్వేశాఖ మంజూరు చేసింది. మచిలీపట్నం నుంచి రేపల్లె వరకు 45.30 కిలోమీటర్ల రైలు మార్గాన్ని ఒక సెక్షన్‌గా, రేపల్లె నుంచి బాపట్ల వరకూ 45.81 కిలోమీటర్ల రైల్వేలైన్ మరో సెక్షన్‌గా తీసుకున్నారు. ఈ మేరకు రెండు కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కోసం సర్వే చేపట్టి, డీపీఆర్ తయారీకి రైల్వే శాఖ వేర్వేరుగా ఆదేశాలు జారీ చేసింది. మచిలీపట్నం-రేపల్లె మధ్య చేపట్టబోయే 45.30 కిలోమీటర్ల కొత్త రైల్వేలైనుకు సంబంధించి గత ఆగస్టులోనే ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్‌ఎల్‌ఎస్) కోసం రైల్వేబోర్డు ఆదేశాలిచ్చింది. ఈ రైల్వే లైన్‌ను రేపల్లే వరకు వేసి.. ముగించే కంటే దీన్ని బాపట్ల వరకు కొనసాగించి చెన్నై-హౌరా లైన్‌లో కలపడం వల్ల ప్రత్యామ్నాయ మార్గం ఏర్పడుతుందన్న విన్నపాల మేరకు ఇప్పుడు తాజాగా రేపల్లె నుంచి బాపట్లకు కొత్త రైల్వే లైన్ వేసేందుకు అనుమతుల ఉత్తర్వులు వచ్చాయి.

కాగా మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైన్ కోసం ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఈ రైలు మార్గం కోసం గతంలో ఆందోళను కూడా జరిగాయి. చివరికి కూటమి ప్రభుత్వంలో రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వారి కల నెరవేరబోతోంది. ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే విజయవాడతో సంబం ధం లేకుండా మచిలీపట్నం-రేపల్లె-బాపట్ల రైల్వేలైన్ ప్రత్యామ్నాయ మార్గంగా మారు తుంది. ఈ రైల్వే మార్గం మచిలీపట్నం పోర్టుకు సరకు రవాణాలో కీలకం కాబోతోంది. ప్రస్తుతం ఇప్పుడున్న రైల్వే మార్గంలో మచిలీ పట్నం నుంచి గుడివాడ, విజయవాడ మీదుగా తెనాలి వరకు వెళ్లాలంటే దాదాపుగా 120 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోంది. అలాంటిది మచిలీపట్నం-రేపల్లె - బాపట్ల మధ్య కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేస్తే తెనాలి, బాపట్ల వరకు చేరుకోవడానికి దూరం తగ్గిపోవడంతో పాటు సమయం ఆదా అవుతుంది. ఇప్పటికే తెనాలి- రేపల్లే మధ్య రైల్వే లైన్ ఉంది. ఈ కొత్త మార్గం ద్వారా ▶ 2లో

'రెవెన్యూ'లో 649 పోస్టులు ఖాళీ

- క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరతతో పాలన కష్టతరం
- అర్జీల పరిష్కారం లేక కార్యాలయాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పాలనలో కీలకమైన రెవెన్యూ శాఖ పనితీరుపై ప్రజాప్రతినిధులు కొంత అసంతృప్తిగానే ఉన్నారు. నేరుగా కలెక్టర్ పర్యవేక్షించే రెవెన్యూ శాఖ పాలనా యంత్రాంగానికి గుండె లాంటిది. ఈ శాఖ పనితీరు బాగుంటే అంతా బాగున్నట్లే.. అయితే ఇప్పుడు రెవెన్యూశాఖ నిర్వీర్యమవుతోంది. ప్రొటోకాల్ మొదలు కోర్టులకు వెళ్లే కేసుల వరకూ అన్నీ రెవెన్యూ శాఖ పనిగానే ఉంది. అయితే ఈ శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఫైళ్లకు గ్రహణం పడుతోంది. వేగం తగ్గుతోంది. అర్జీలకు మోక్షం కలగడం లేదు. ఏదైనా పని కోసం ఏ కార్యాలయానికి వెళ్లినా కొద్ది రోజుల్లోనే ఫలితం ఉంటుంది. అయితే రెవెన్యూశాఖలో పనైతే అంతే సంగతులు అన్నట్లుగానే పరిస్థితి ఉంది. సిబ్బంది పెద్దఎత్తున కొరత వల్ల పనులు ఎక్కడివక్కడే ఆగిపోతున్నాయని స్పష్టమవుతోంది. జిల్లాలో రెవెన్యూశాఖలో ప్రస్తుతం 20 శాతానికిపైగా ఉద్యోగుల ఖాళీలున్నాయి. వాటిని భర్తీ చేస్తే తప్ప రెవెన్యూ శాఖ పరుగులు తీసే పరిస్థితి లేదు. క్షేత్రస్థాయిలో తహశీల్దార్ మొదలు అన్ని క్యాడర్ల ఉద్యోగులు 9 రకాలున్నారు. వీరంతా జిల్లాలో 2682 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 2033 మంది ఉన్నారు. 649 ఖాళీలున్నాయి. వీరిలో రెండు తహశీల్దార్ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. విఆర్‌ఏలు 463 పోస్టులు, గ్రేడ్-1 విఆర్‌ఓలు 113 మంది, సీనియర్ అసిస్టెంట్లు 47, డిప్యూటీ తహశీల్దార్లు 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాలన్నా రాజకీయంగానూ నేతల అనుమతి కావాలి. అందుకే చాలా పోస్టులు ఖాళీగా కూడా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక బదిలీల ప్రక్రియ పెద్ద ప్రహసనంగా మారింది. ఆచీతూచీ వేస్తున్నారు. పోస్టింగుల వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు. ఇప్పుడు రెవెన్యూశాఖపైనా ప్రజాప్రతినిధులు ఇన్‌ఛార్జి మంత్రి ఎదుట అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలాల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని పెట్టాలి. అప్పుడే ఫైళ్లు ఎక్కడివక్కడ కదులుతాయి. కార్యాలయాల్లో ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. ఫైళ్లు సజావుగా కిందిస్థాయి నుంచి పైస్థాయికి వెళ్లడం లేదు. ఎక్కడో చోట ఆగిపోతున్నాయి. ఏదో సెక్షన్‌లో ఉందని సమాధానం చెబుతారు. ఫలానా సీట్లో పోస్టు ఖాళీగా ఉందని, ఆయన రాగానే పనిచేస్తామని సమాధానం చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇదే జరుగుతోంది. దీంతో బాధితులు నేరుగా కలెక్టర్ వద్దకు వస్తున్నారు. ప్రజాసమస్యల వేదికకు వచ్చి అర్జీలు ఇస్తున్నారు. వాటిని తిరిగి అదే కార్యాలయాలకు పంపుతారు. అక్కడ పరిస్థితి మళ్లీ ఇదే.. ఇలా ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కాక ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.



కార్మికుల ఆందోళన విరమణ సందర్భంగా మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

ఫలించిన కార్మికుల పోరు

- విధుల్లో చేరాలని అధికారుల పిలుపు..
- ముగిసిన బాధిత కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికుల పోరాటం ఫలించింది. ఇంజనీరింగ్ విభాగంలో అక్రమంగా తొలగింపబడిన 21 మంది కార్మికులు విధుల్లో చేరాలని ఎట్టకేలకు ఉన్నతాధికారుల ద్వారా పిలుపు వచ్చింది. దీంతో కార్మికులు బుధవారం నాడు ఆందోళన విరమించారు.

మార్కాపురం మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల్లో 21 మంది అక్రమంగా తొలగించబడ్డారు. వారంతా సిఐటియు అనుబంధంగా 'ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్'లో కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడింది. కార్మికులపై రాజకీయ వేధింపులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విధుల్లోకి రావద్దంటూ హుకుం జారీ చేశారు. పాతికేళ్లుగా తాము విధుల్లో కొనసాగుతున్నామని, తమ కడుపులు కొట్టొద్దని విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. తప్పని పరిస్థితుల్లో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన మొదలైంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలోకి అధికారులను రాకుండా అడ్డుకున్నారు. కార్యాలయంలో విధులను సైతం అడ్డుకున్నారు. పోరాటాన్ని ఉధృతం చేశారు. కార్మికులకు మద్దతుగా మున్సిపల్ ▶ 2లో

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా రంగ సుబ్బరాయుడు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

సిఎస్‌పురం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం. రంగసుబ్బరాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పనిచేస్తున్న మండల పరిషత్ కార్యాలయ ఎఒ ఖాదర్‌బి సెలవుపై వెళ్లారు. దీంతో హనుమంతునిపాడు ఎండిపిఒగా పనిచేస్తున్న రంగ సుబ్బరాయుడుకు సిఎస్‌పురం ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా రంగ సుబ్బరాయుడు బాధ్యతలు చేపట్టారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ ఆదాతో పాటు ప్రజలకు ఖర్చుతగ్గుతుందని దర్శి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికి వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. కిలో వాట్‌కు 30,000, రెండు కిలో వాట్స్ 60, 000, మూడు కిలో వాట్స్‌కు 78,000 రాయితీ ఉంటుందన్నారు. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ ఈ పథకానికి అర్హులని ఆయన తెలిపారు. 300 యూనిట్ల లోపు వినియోగించుకునే వారికి సబ్సిడీ ఉంటుందన్నారు. ప్రజలు సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం ఈ పాటికే కొన్ని రాష్ట్రాల్లో అమలులో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇంజనీర్ మోహన్‌రావు, ఎఇ ఎస్.వీరబ్రహ్మం, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన కార్మికుల పోరు

(మొదటిపేజీ తరువాయి)

కౌన్సిల్ కూడా అండగా నిలిచింది. కార్మికులకు మద్దతుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ ఆందోళనలు కొనసాగాయి. జిల్లాస్థాయి అధికారులకు ఇక్కడ జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. అమరావతిలో సిఎం చంద్రబాబును సైతం ఇదే అంశంపై కలిశారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సిఎం చంద్రబాబుతో సహ అందరూ సానుకూలంగా స్పందించారు. కార్మికులను విధుల్లోకి తీసుకునేందుకు అధికారులు సహకరించారు. కార్మికులు విధుల్లోకి రావాలని అధికారుల నుండి బుధవారం పిలుపు రావడంతో 22 రోజులుగా చేపట్టిన ఆందోళనకు కార్మికులు స్వస్తి పలికారు. ఆందోళన ముగింపులో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్మికులు ఐక్యంగా పోరాడటంతో విజయం సాధించినట్లు తెలిపారు.. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి, సిపిఎం పట్టణ కార్యదర్శి డి సోమయ్య, సిఐటియు జిల్లా నాయకులు బి వెంకట్రావు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.సుబ్బరాయుడు, జి హరి, షేక్ షబ్బీర్, కనకయ్య, యూసుఫ్, రమణ, నాగయ్య, సుబ్రహ్మణ్యం, అబ్దుల్, సలాం, చెన్నకేశవులు, పి శ్రీను, శేషిరెడ్డి పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాకు కొత్త రైలు మార్గం

(మొదటిపేజీ తరువాయి)

మచిలీపట్నం నుంచి చెన్నై, తిరుపతి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణం సులభంగా ఉంటుందని చెబుతున్నారు. మచిలీపట్నం నుంచి చేపలు, రొయ్యల వంటివి కూడా రవాణాకు మార్గం సుగమం అవుతుంది. మచిలీపట్నం పోర్టు నిర్మాణం కూడా జరుగుతున్న క్రమంలో ఈ రైల్వేలైన్ వల్ల సరకు రవాణాకు కూడా ప్రయోజనం ఉంటుందంటున్నారు. ఈ రైల్వే లైన్ నేరుగా బాపట్ల వద్ద హౌరా-చెన్నై ప్రధాన రైల్వే మార్గంతో అనుసంధానం కావడంతో సుమారు 100 కిలోమీటర్ల వరకూ దూరం కూడా తగ్గుతుందంటున్నారు. మచిలీపట్నం నుంచి చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, నుంచి కృష్ణానది దాటి అక్కడి నుంచి రేపల్లె, నిజాంపట్నం, పేర్లిపాడు మీదుగా బాపట్ల వరకు నూతన రైల్వేలైన్ రానుంది. త్వరలోనే సర్వే పనులను ప్రారంభించి మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ పనులు ముందుగా ప్రారంభిస్తారని తెలుస్తోంది.

జివిఆర్ ఫ్యాక్టరీలో ఐటి దాడులు

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి దాడులూ జరగలేదు. అయితే గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భీమవరంలో ప్రస్తుత డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను ఓడించింది గ్రంధి శ్రీనివాసరావే.. ప్రస్తుతం ఆయన గత ఎన్నికల్లో ఓటమిపాలై ఉన్నారు. రాజకీయ నేపథ్యంలో ఏమైనా ఈ దాడులు జరిగాయా అనే అనుమానాలూ ఇక్కడ వ్యక్తమవుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఐటి అధికారులు తనిఖీ చేస్తున్న నేపథ్యంలో అక్కడ ఫ్యాక్టరీలోకి పనికి వెళ్లిన కార్మికులను ఎవరిని లోపల నుంచి బయటికి పంపకపోవడం గమనార్హం. బుధవారం రాత్రి అయినప్పటికీ 20 మంది ఐటీ శాఖ అధికారులు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం : ఒత్తిడికి లోనయ్యే పనుల నుంచి ఉపాధ్యాయులు తక్షణమే తప్పించాలని ఎపిటిఎఫ్‌మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు జెఎస్.ఆనందబాబు, జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం రద్దు చేయాలని కోరారు. అపార్ నమోదు, ఆధార్ మిస్ మ్యాచ్ సమస్యలు, యఫ్ఎల్ఎన్, లీడర్ షిప్ శిక్షణ లాంటి బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులపైఒత్తిడి పడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రెసిడెన్షియల్ మోడ్ శిక్షణ కార్యక్రమాన్ని రద్దుచేసి, అన్ని శిక్షణా కార్యక్రమాలు నాన్ రెసిడెన్షియల్ తరహాలో డివిజన్ కేంద్రాల్లో నిర్వహించాలని వారు కోరారు.




కోటయ్యను పరామర్శిస్తున్న పూనాటి ఆంజనేయులు

ముప్పరాజు కోటయ్యకు పరామర్శ

ప్రజాశక్తి-కొండపి

సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ ముప్పరాజు కోటయ్య ఇటీవల అనారోగ్యానికి గురి కాగా బుధవారం పెరిదేపి గ్రామంలోని ఆయన ఇంటి వద్ద సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, గంటినపల్లి శ్రీనివాసులు, కంకణాల రమాదేవి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను గురించి తెలుసుకున్నారు.



అర్జీ ఇస్తున్న 104 ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-పొదిలి

104 వాహన సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు సచివాలయం, కాకర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సాయి రుచితకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా 104 వాహన సిబ్బంది మాట్లాడుతూ తమకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ మరియు డిఇఒకు జీవోనంబరు 7 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ నగదు తిరిగి చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 వాహన సిబ్బంది సంఘ డ్రైవరు శివ, డిఇఒ చిరంజీవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి..

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ నేతల వేధింపులు, పోలీసుల బెదిరింపులతో ఆత్మహత్య చేసుకున్న ఎస్‌సి రైతు చింతల శీను కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, బాధిత కుటుంబాన్ని హోంమంత్రి అనిత పరామర్శించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ బాధితుల్ని పరామర్శించటం, ఆర్థిక సాయం ప్రకటించడంలో రాజకీయ వివక్ష చూపించడం మంచిది కాదన్నారు. చింతల శీను సెల్ఫీ వీడియోలో తన మరణానికి కారణమని పేర్కొన్న ఏడుగురిలో ఏ ఒక్కరిని కూడా పోలీసులు ఈరోజు వరకు అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హోంమంత్రి అనిత చింతల శీను కుటుంబాన్ని పరామర్శించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు గంటా సుబ్బారావు, దళిత నాయకులు కాకుమాను రవి పాల్గొన్నారు.

భూసమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్



అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-కొత్తపట్నం

భూమి సంబంధిత సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. కొత్తపట్నం పరిధిలోని నల్లూరి గార్డెన్ మినీ హాల్లో మండల రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ మధుసూదన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దామచర్ల జనార్ధన్ మాట్లాడారు. మొదటగా గ్రామాల వారీగా అర్జీలు తీసుకొని నిశితంగా పరిశీలించారు. కొత్తపట్నం మండల కేంద్రంలో ఎస్సీలకు సుమారు 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం భూములు ఇచ్చిందని వాటిని ఇంతవరకు ఆన్‌లైన్ చేయలేదని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆన్‌లైన్ చేయని కారణంగా ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకము కూడా వర్తించడం లేదన్నారు. ఎమ్మెల్యే జనార్ధన్ ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవోకు సూచించారు. మండలం మొత్తం మీద సుమారుగా 145 అర్జీలు వచ్చాయని, ఇందులో ఎక్కువగా ఆన్‌లైన్ సమస్యపై వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, తహశీల్దార్ మధుసూదన్ రావు, అన్ని శాఖల మండల అధికారులు, టిడిపి మండల అధ్యక్షులు శ్రీను, మాజీ ఎంపిపి నాలం నరసమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పొదిలి

గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సమస్యలు లేకుండా చేయటమే ప్రభుత్వ ధ్యేయమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కంభాలపాడు ఎస్‌సి కాలనీలో నూతన స్తంభాలు, విద్యుత్ లైన్ ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతుల కోసం ఆర్‌డిఎస్‌ఎస్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మార్కాపురం నియోజకవర్గంలోని 4 మండలాల్లో లో ఓల్టేజ్ సమస్య లేకుండా త్రీ ఫేస్ కరెంట్ సరఫరాకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పాలగిరి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు మీగడ ఓబుల్ రెడ్డి, పొదిలి మాజీ సర్పంచి కాటూరి నారాయణ ప్రతాప్, నాయకులు బెల్లంకొండ విజయలక్ష్మి, డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాస రావు, తాతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, నరేష్, ముల్లా గౌస్ భాషా, మద్దుల శ్రీనివాసులు, కల్లూరి రవికుమార్ రెడ్డి, ఆవులూరి నాయుడు, కల్లూరి భాస్కర్ రెడ్డి, జవ్వాజి శైలు, సంగాల రామయ్య, జవ్వాజి వెంకటేశ్వర్లు, జాన్సన్ పాల్గొన్నారు.



విద్యుత్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందుల

కొనకనమిట్ల: మండల పరిధిలోని చౌటుపల్లి ఎస్సీ కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్ల ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా కాలం క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు కావడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజినీర్ మోహన్‌రావు, కన్ స్ట్రక్షన్ ఎఇ రమేష్, ఎఇ వీర బ్రహ్మం, సబ్ ఇంజినీర్ రామకృష్ణ, లైన్‌ఇన్‌స్పెక్టర్ సామ్యూల్, టిడిపి మండల కన్వీనర్ మూరబోయిన బాబూరావు, మండల మాజీ కన్వీనర్లు వి.వెంకటరామిరెడ్డి, తాతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, కనకం నరసింహారావు, వెంకట నారాయణరెడ్డి, గొట్లగట్టు, వింజ వర్ధిపాడు సర్పంచులు పెరిక సుఖ్‌దేవ్, వెంకటనారాయణరెడ్డి, నాయకులు కుందూరు కాశిరెడ్డి, యోధుబాటి వెంకట నారాయణ, జవ్వాజి బాషా పతినాయుడు, ముచ్చ కాటంరాజు, రమణారెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, సిరుగూరి యేసు, ఎస్.అబ్రహం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

ప్రజాశక్తి-కొండపి

పొగాకు బోర్డు వారు ఇచ్చిన అనుమతి మేరకు మాత్రమే పొగాకు పంటను పండించాలని కొండపి పొగాకు వేలం నిర్వాహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం పైడిపాడు గ్రామంలో పొగాకు నర్సరీ పెంపకం దారులకు శిక్షణ కార్యక్రమం మరియు పొగాకు నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటలు మీద అవగాహన సదస్సు నిర్వహించారు. పొగాకు బోర్డు సాంకేతిక సిబ్బంది, శాస్త్రవేత్తలు, వ్యాపార ప్రతినిధులు కలిసి పైడిపాడు, చతుకుపాడు, కామేపల్లి గ్రామాలలోని పలు పొగాకు నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సునీల్ కుమార్ మాట్లాడుతూ అధిక వర్షాలతో పొగాకు నర్సరీ యాజమానులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొగాకు శాస్త్రవేత్త పిల్ల వెంకటేశ్వర రావు నర్సరీ యాజమానులు కుళ్ళు తెగులు, బొబ్బ తెగులు, మరియు కలుపు మొదలైన సమస్యలను వాటి యాజమాన్య పరిష్కారాలను కూలంకుషంగా వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి పొగాకు రైతు వారి బారన్ దగ్గర పది మొక్కలు నాటవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ల రామాంజనేయులు, పైడిపాడు సర్పంచి నాగినేని భాస్కర చౌదరి, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

మిడసల వెంకటసుబ్బయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన కమ్యూనిస్టు పార్టీ యోధుడు మిడసల వెంకటసుబ్బయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. మిడసల వెంకట సుబ్బయ్య 22వ వర్ధంతి సందర్భంగా శ్రీ నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు మిడసల మల్లికార్జున రావు ఆధ్వర్యంలో ఒంగోలు సివిఎన్ రీడింగ్ రూమ్, క్లబ్‌లో బుధవారం సంస్మరణ సభ జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పలు సాహితీ సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షత వహించారు. కార్మిక నేత కరవది సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ద్వారా బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మిడసల వెంకటసుబ్బయ్య లేనిలోటు పూడ్చలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో లలిత కళా అకాడమీ అధ్యక్షులు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, అల్లూరు ఎంపిటిసి మిట్నసల శాంతారావు, విశ్రాంత అధికారులు మెదబలిమి సాంబశివ రావు, తహశీల్దార్ పేరయ్య, అంగలకుర్తి ప్రసాద్, కొప్పోలు వెంకటేశ్వర్లు, అయినంపూడి నరసింహం పాల్గొన్నారు.

చెరువులో పడి మహిళ అనుమానాస్పద మృతి ..?



మృతి చెందిన సుశీల

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని చిన్న చెరువులో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని బాప్టిస్ట్ పాలెనికి చెందిన సుశీల అనే వివాహిత చిన్న చెరువులో కేకలు వేస్తూ మునిగిపోతుండగా ఓ ఆటో డ్రైవర్ గమనించాడు. అతడు చెరువు దగ్గరకు వెళ్లేసరికి అప్పటికే ఆమె నీళ్లలో పూర్తిగా మునిగిపోయిన పరిస్థితి కనిపించింది. వెంటనే ఆటో డ్రైవర్ పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రాథమికంగా మృతురాలు పొదిలి మండలం బాప్టిస్ట్ పాలెంకు చెందిన వివాహిత సుశీలగా గుర్తించారు. ఉదయం బయటికి వెళ్లిన ఆమె ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం చిన్న చెరువులో తను అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం గ్రామంలో తెలియడంతో కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసుల గాలించి సుశీల మృతదేహాన్ని బయటకు తీశారు. ఈమె ఇటీవల కాలంలో ఆరోగ్యం సరిగా లేక పోవడంతో కలత చెంది ఆత్మహత్యకు పాల్పడిందా? లేక మతిస్థిమితం లేక చెరువులో పడి మృతి చెందిందా? అనే దిశగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్యంతో మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులు మరియు బంధువులు భావిస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - బేస్తవారిపేట

మండల కేంద్రంలోని ఆర్యే నగర్ జంక్షన్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్ఐ ఎస్వీ రవీందర్ రెడ్డి బుధవారం అరెస్టు చేశారు. వీరి నుంచి 23 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మండలంలోని గలిజేరుగుల్ల గ్రామంలో బెల్టు షాపుపై దాడి చేసి 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రవీందర్ రెడ్డి తెలిపారు.

కొండపి: అక్రమంగా తీసుకొని వెళుతున్న 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కొండపి ఎస్ఐ ప్రేమకుమార్ తెలిపారు. కొండపి గ్రామంలోని మద్దులూరు రోడ్డులో మద్యం బాటిళ్లు తీసుకువెళుతున్న చలువాది కోటేశ్వరరావు వద్ద 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సిపిఎం కొండపి మండల కార్యదర్శిగా మల్లెల కొండయ్య

ప్రజాశక్తి-కొండపి



మల్లెల కొండయ్య

కొండపి మండల సిపిఎం కార్యదర్శిగా మల్లెల కొండయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం సిపిఎం మండల ఏడో మహసభ జరిగింది. మండల కమిటీ సభ్యులుగా కేజీ మస్తాన్, ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, అంగలకుర్తి సూరిబాబు, వి.రూబేన్, ఏ.విశ్రాంత, లక్ష్మిపోగు పరిశుద్ధరావు, పారాబత్తిని శ్రీనివాసరావు, మల్లెల చిన్న పేతురు ఎంపికయ్యారు.



పనికల్పించాలని ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ఉపాధి కూలీల ఆందోళన

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని లంక గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వామపక్షాల ఒత్తిడితో 15ఏళ్ల క్రితం వచ్చిందని అన్నారు. పని లేని రోజుల్లోనే కూలీలకు పని కల్పించాలని కోరారు. వలసలు నివారించాలనే దృఢ నిశ్చయంతో వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఇటీవల కృష్ణా నదికి వరదలు వచ్చిన నేపథ్యంలో మండలంలోని లంక గ్రామాల ప్రజలకు పనులు లేవని అన్నారు. బతకటమే భారమైందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేకసార్లు గ్రీవెన్స్‌లో ఎంపిడిఒ, తహశీల్దారులను కలిసి పని కల్పించాలని కోరినట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలో 12 లంక గ్రామాలుంటే రెండు గ్రామాల్లోనే పని కల్పిస్తున్నారని, మిగిలిన గ్రామాల్లో కూడా వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. వందరోజుల పనిలో భాగంగా రోజుకు 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇస్సాకు, మధు బాబు, ఆవులవారిపాలెం ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

నిరుద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని మారెళ్ళ గ్రామంలో డిగ్రీ పూర్తి చేసుకుని నాలుగేళ్లు గడిచినప్పటికీ ఉద్యోగం రాలేదని వెల్లంపల్లి సురేష్ అనే నిరుద్యోగి తన ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పేదరికంలో ఉన్న సురేష్ కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డివైఎఫ్ఐ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కెవి పిచ్చయ్య డిమాండు చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగులు పెరిగిపోతున్నారని అన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. కాళీ పోస్టులను భర్తీ చేయకుండా, ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో చలగాట మాడుతుందని ఆరోపించారు. తక్షణమే ఆత్మహత్య చేసుకున్న సురేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డివైఎఫ్ఐగా నిరుద్యోగుతో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

మనోవికాస కేంద్రంలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి - చీరాల

స్థానిక విఠల్ నగర్లోని చైతన్య మనోవికాస కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు డాక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మనోవికాస కేంద్రం డైరెక్టర్ వెంకన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనం చేస్తున్న పంగులూరు హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచికరంగా, పరిశుభ్రంగా ఉందని సిపిఎం మండల కార్యదర్శి తలపనేని రామారావు అన్నారు. వంట సిబ్బంది జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని అన్నారు. పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం పలావు భోజనం, కుర్మా, ఉడికించిన గుడ్డు, గోంగూర చట్నీ, ఒక చిక్కి విద్యార్థులకు అందించారని తెలిపారు. భోజనం గోంగూర చట్నీ, ఉడికించిన గుడ్డు బాగున్నాయని, రుచికరంగా ఉన్నాయని తెలిపారు. బియ్యం కొంత నాసిరకంగా ఉన్నాయని పేర్కొన్నారు. చాలా రోజుల నుండి నిల్వ ఉన్న బియ్యం కావటం వలన పిండి అవుతున్నాయని చెప్పారు. నాణ్యమైన బియ్యాన్ని ఇస్తే విద్యార్థులు ఇంకా ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. కోడిగుడ్లు కొన్ని చాలా తక్కువ సైజులో కేవలం 40 గ్రాముల బరువు మాత్రమే ఉన్నాయని చెప్పారు. అందులో కొన్ని మురిగిన ఉంటే ఉడికించే ముందే తీసివేస్తున్నట్లు వంట మనిషి కీర్తిపాటి లక్ష్మయ్య తెలిపారు. పాఠశాలలో 402 మంది విద్యార్థులు ఉండగా అందులో 330మంది భోజనాలు హై స్కూలు లోనే తింటారని హెచ్‌ఎం కొప్పోలు రమాదేవి చెప్పారు. పాఠశాలలో చదువుకుంటున్న కొంత మంది విద్యార్థులకు ఇంతవరకు బూట్లు రాలేదని అన్నారు. అందువలన 50మందిపైగా మామూలు చెప్పులే వేసుకుంటున్నారని తెలిపారు. పాఠశాల మెయిన్ టెన్స్ కోసం గతంలో కొంత డబ్బులు వచ్చాయని, వాటి ద్వారా పాఠశాలలో కొన్ని పనులకు వాటిని ఉపయోగించేవారమని తెలిపారు. అయితే గత నాలుగు నెలలుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఫండ్స్ రాకపోవడంతో విద్యార్థులు ఒక్కొక్కరి దగ్గర రూ.200 వసూలు చేస్తున్నామని తెలిపారు. వాటిని పాఠశాలలో ఫ్యాన్ల రిపేరుకు, విద్యుత్ బల్బులకు, వాటర్ ప్లాంట్ మరమ్మతులు వంటి ఖర్చులకు వాడుతున్నామని తెలిపారు. ఈ ఏడాది 10వ తరగతి ఫలితాలు, ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో తమ విద్యార్థులు మండల స్థాయిలో అత్యంత ప్రతిభ కనపరచారని తెలిపారు. తామంతా శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నామని, మండల స్థాయిలో పాఠశాలను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఆమె చెప్పారు.



భోజనాన్ని రుచి చూస్తున్న సిపిఎం కార్యదర్శి రామారావు

సిపిఎం సీనియర్ సభ్యులు లక్ష్మయ్య మృతి

ప్రజాశక్తి - రేపల్లె

నల్లూరిపాలెం సిపిఎం సీనియర్ సభ్యులు కామ్రేడ్ అమ్మిరినేని లక్ష్మయ్య (95) బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహంపై సిపిఎం జెండా కప్పి సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ నివాళులు అర్పించారు. ఎర్రజెండాలతో లక్ష్మయ్య అంతిమ యాత్ర నిర్వహించారు. గ్రామంలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి సిపిఎంలో కొనసాగుతూ ప్రజల కోసం తన జీవితంలో విలువైన సమయాన్ని కేటాయించిన వ్యక్తి లక్ష్మయ్యని అన్నారు. రేపల్లె ప్రాంత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ, మోటూరి హనుమంతరావుతో కలిసి ఉద్యమాల్లో పనిచేశారని గుర్తు చేశారు. రైతాంగ సమస్యలతోపాటు ఆరోజుల్లోనే దళితులు, వ్యవసాయ కూలీల సమస్యలపై ఇచ్చే పిలుపుల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయనకు ఆరోగ్యం సహకరించినంతకాలం కార్యక్రమాల్లో పాల్గొనటమే కాకుండా తనకుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో అన్ని సందర్భాల్లో కమ్యూనిస్టు సిద్ధాంతం గురించి ప్రచారం నిర్వహించేవాడని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి రమాదేవి ఒక ప్రకటనలో లక్ష్మయ్య కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నల్లూరిపాలెం, సింగుపాలెం సిపిఎం సభ్యులు జి దానియేలు, కె రమేష్, డి బాబురావు, బి ఆగస్టిన్, లక్ష్మయ్య కుటుంబ సభ్యులు అమిరినేనీ బసవపున్నయ్య పాల్గొన్నారు.



లక్ష్మయ్య మృతి, నివాళులు అర్పిస్తున్న సిపిఎం కార్యదర్శి సిహెచ్ మణిలాల్

మార్చురీకి ఫ్రీజర్ బాక్సు బహూకరణ

ప్రజాశక్తి - బాపట్ల

ప్రాంతీయ వైద్యశాల మార్చురీకి ప్రీజర్ బాక్సును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరాల పూర్వీ స్కాన్ సెంటర్ వైద్యులు డాక్టర్ పేట శ్రీకాంత్ సౌజన్యంతో బుధవారం వైద్య ఆరోగ్య అధికారి ఎస్ విజయమ్మకు అందజేశారు. బాపట్ల ఏరియా వైద్యశాల ఎసి ఫ్రిజర్ బాక్సుల కొరత ఉన్న నేపథ్యంలో స్వచ్ఛందంగా ప్రీజర్ బాక్స్ అందజేసినట్లు డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేసషన్ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డేమో మరియమ్మ, ఐఎంఎ చీరాల బ్రాంచ్ అధ్యక్షులు శ్రీదేవి, అసోసియేషన్ బాపట్ల అధ్యక్షులు హాక్, కార్యదర్శి మధు సాల్మన్, బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ సిద్ధార్థ, సుజాత, రూప ప్రియాంక పాల్గొన్నారు.



మార్చురీ ప్రిజర్ బాక్స్ అందిస్తున్న దాతలు

అర్హులైన పట్టభద్రులకు ఓటు కల్పించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అర్హత ఉండి దరకాస్తు చేసుకు పట్టబద్రులు అందరికీ ఓటు హక్కు కల్పించాలని ప్రజాసఘాల ఆధ్వర్యంలో తహశీల్దారుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు సురేష్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి మనోజ్ కుమార్, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ మాట్లాడారు. ఇతర మండలాల్లో ఎక్కడా లేని విధానం భట్టిప్రోలు మండలంలో ఓటర్ ఐడి కార్డ్ జిరాక్స్, జిరాక్స్ కాపీల మీద అభ్యర్థి సంతకం లేకపోవడంతో కొంత మంది పట్టబద్రులను తిప్పి పంపించిన సంఘటన చోటు చేసుకుందని అన్నారు. పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటుకు దరకాస్తు చేసుకున్న వారి అప్లికేషన్లను తిరస్కరించకుండా విచారించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. భారత రాజ్యాంగం ప్రకారం ఓటు హక్కును అర్హత ఉన్న ప్రతి పౌరునికి కల్పించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారమే పట్టబద్రులు ఓటు కోసం దరకాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆఖరి రోజున 6న ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు సర్వరు పనిచేయక నిలిచిపోవడంతో అనేక మంది నిరాశకు గురయ్యారని తెలిపారు. వారు ఓటు హక్కు పొందేందుకు సమయాన్ని పొడిగించాలని కోరారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



డిఆర్‌ఓతో మున్సిపల్ కమిషనర్

డిఆర్‌ఒను కలిసిన కమిషనర్

ప్రజాశక్తి - బాపట్ల

పురపాలక సంఘ ప్రత్యేక అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డి గంగాధర్ గౌడ్‌ను మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సిపిఎస్ ఉద్యోగుల సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రాష్ట్ర వ్యాప్తంగా 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియామకమైన ప్రభుత్వ ఉద్యోగులకు మిస్సింగ్ క్రెడిట్స్ సమస్య ఎదుర్కొంటున్నట్లు, నెలనెలా ప్రభుత్వ ఉద్యోగి జీతం నుండి 10శాతం అమౌంట్ కట్ చేస్తున్నారే కానీ ప్రభుత్వ వాటా అయిన 10శాతం జమ కాక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సిపిఎస్ ఉద్యోగులు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీ మోహన్ అన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు ఇటీవల ఎపి వైద్య విధాన పరిషత్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా 010 కింద జీతాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో సిపిఎస్ అమౌంట్ క్రెడిట్ రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. వెంటనే ఉద్యోగుల ఖాతాల్లో సిపిఎస్ మిస్సింగ్ క్రెడిట్స్ అమౌంట్ జమ చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో సిపిఎస్ ఉద్యోగుల 10శాతం ప్రభుత్వ వాటా ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు.

విఆర్‌ఒల సంఘం అధ్యక్షునిగా యార్లగడ్డ

ప్రజాశక్తి - పర్చూరు

వీఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షునిగా యార్లగడ్డ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం కవిత, కోశాధికారిగా ఎస్‌కె హుస్సేన్, ఉపాధ్యక్షునిగా గోవిందరెడ్డి, ఎం జానకి సభ్యునిగా ఎన్నుకున్నారు.



శ్రీనివాసరావు



అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ మేస్త్రీలు

మున్సిపల్ మేస్త్రీల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థలోని పారిశుధ్య విభాగంలో తొలగించిన మేస్త్రీలను తిరిగి విధుల్లోకి తీసుకొని, మేస్త్రీలుగానే కొనసాగించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మేస్త్రీలు బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు మేస్త్రీల వ్యవస్థ లేదని, అందరూ పారిశుధ్య పనులు చేయాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. గత 20 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం, ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారంతా మేస్త్రీలుగానే కొనసాగుతున్నారని తెలిపారు. వాళ్లను ఇప్పుడు అర్ధాంతరంగా పనిలోకి రాకుండా నిలిపివేయడం వాళ్ల కుటుంబాలను వీధులపాలు చేయటమేనన్నారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న మేస్త్రీలను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా కార్మికులను ఐక్యం చేసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడుతూ ఒంగోలు ఎమ్మెల్యే మున్సిపల్ కార్మికుల సమస్యలమీద జోక్యం చేసుకొని వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఏళ్లతరబడి పనిచేస్తున్న వారిని విధుల్లో కొనసాగించడానికి మున్సిపల్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కె.ఆదినారాయణ, సిహెచ్.వెంకటేశ్వర్లు, అజయ్, ప్రశాంత్, విజయ్, విజయవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ధరల భారాలకు వ్యతిరేకంగా

ప్రజాపోరుకు సిద్ధంకండి..

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పిలుపు
- నవంబర్ 8 నుండి ప్రజా సమస్యలపై ప్రచార ఉద్యమం



మాట్లాడుతున్న పూనాటి ఆంజనేయులు

ప్రజాశక్తి-కొండపి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ధరల భారాలు, మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న అకత్యాలకు వ్యతిరేకంగా నవంబర్ 8 నుండి 14 వరకు జరిగే ప్రజాపోరులో పాల్గొనాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం సిపిఎం మండల ఏడవ మహాసభలు కొండేపిలో జరిగాయి. ఈ సభలకు ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, అంగలకుర్తి విశ్రాంతి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా పూనాటి మాట్లాడుతూ ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టించే విధంగా ప్రజాస్వామ్యాన్ని పరిహాసం ఆడే విధంగా జమిలి ఎన్నికలకు కేంద్రం సిద్ధం కావడం అమానుషమని అన్నారు. అది ప్రజాస్వామ్యాన్ని హరించి నియంతత్వానికి దారి తీస్తుందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజల మీద ధరల భారాలను కేంద్ర ప్రభుత్వం మోపిందని, రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా అప్పులు ఇప్పిస్తామనటం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టడం లాంటి చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటు చార్జీల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అది గత ప్రభుత్వ నిర్ణయమని, ఈ ప్రభుత్వం తప్పించుకో చూడటం తగదని అన్నారు. మద్యాన్ని నియంత్రించే విధంగా నూతన మద్యం పాలసీని సవరించాలని ఆయన కోరారు. సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటెనపల్లి శ్రీనివాసులు, కంకణాల రమాదేవి పాల్గొని ఉపన్యశించారు. సిపిఎం మండల కార్యదర్శి కేజీ మస్తాన్ గత మూడేళ్ల కాలంలో నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాల నివేదికను ప్రవేశపెట్టారు. సభకు ముందుగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు గడ్డం పిచ్చయ్య ఆవిష్కరించారు. సభలో సిపిఎం నాయకులు మల్లెల కొండయ్య, అంగళకుర్తి చిన్న బ్రహ్మయ్య, వి. రూబెన్, జి.వందనం, యం.చిన్న పేతురు, పుట్టా రామారావు, యల్ పరిశుద్ధం, సుకన్య, సుధాకర్, పి శ్రీను, ఏ. సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మంత్రులు

వికలాంగులకు రూ.90 లక్షల రుణాల పంపిణీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలోని 18 మంది వికలాంగులకు స్వయంఉపాధి కోసం రూ.90 లక్షల రుణాలను పంపిణీ చేసినట్లు ఆ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన తెలిపారు. అర్హులైన ఒక్కొక్క వికలాంగునికి రూ.5 లక్షలు చొప్పున నామమాత్రపు వడ్డీతో రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు కెవెల్ లక్ష్మణరావు, చీరాల ఎమ్మెల్యే ఎం మాలకొండయ్య, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు డిజెఎఫ్ కతజ్ఞతలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థలలో 50 శాతం రాయితీ అమలు చేసే విధంగా జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసిన సందర్భంగా డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం (డీజెఎఫ్) ప్రతినిధులు బుదవారం జిల్లా కలెక్టర్ జె వెంకటమురళిని కలిసి కతజ్ఞతలు తెలియజేశారు. చీరాల నియోజకవర్గంలో వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ ఇండ్ల స్థలాలు మంజూరు అయ్యేవిధంగా చొరవ తీసుకోవాలని జర్నలిస్ట్ ఎన్.నాగార్జునరెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డిజెఎఫ్ రాష్ట్ర ప్రతినిధి ఎన్.నాగార్జునరెడ్డి, 10 టీవీ ప్రతినిధి దాసరి మణికంఠ, క్రైమ్ కౌంటర్ ప్రతినిధులు రాబర్ట్ వెస్లీ, సిహెచ్ చిన్నా పాల్గొన్నారు.

శ్మశానవాటికను కాపాడాలని వినతి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని గుండ్లకమ్మ సమీపంలో నాగులవరం రహదారిలోని మాలలకు సంబంధించిన శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మాల సామాజికవర్గానికి చెందిన పలువురు వినతిపత్రాన్ని బుధవారం అందించారు. తాము 1920వ సంవత్సరం నుండి ఈ శ్మశాన వాటికను వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. సుమారు 12 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమి నివాసాలకు అనువుగా ఉన్నందున కొందరు రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు ఆక్రమించే పనికి ఉపక్రమిస్తున్నట్లు ఆరోపించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన నాయకులు తరచూ ఆక్రమణల ప్రయత్నం చేస్తున్నారని అధికారులకు వివరించారు. పట్టణంలోని మాలలందరికీ ఈ శ్మశానమే దిక్కన్నారు. అదీ లేకుండా చేస్తే మాత్రం తాము ఎంతవరకైనా వెళతామని, తమకు గొడవలు లేకుండా అధికారులు ఆ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు.



ఎంఈవోకు సన్మానం చేస్తున్న దృశ్యం

ఎంఈవోకు ఘన సన్మానం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న బి శ్యాముల్ జార్జ్ పనితనం మెచ్చుకొని ఉన్నతాధికారులు మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు అప్పగించిన తరుణంలో మార్కాపురంలో బాధ్యతలు స్వీకరించారు. బుధవారం పుల్లలచెరువులో విద్యా వనరుల కార్యాలయంలో బి శ్యాముల్ జార్జ్‌ను పుల్లలచెరువు జిల్లాపరిషత్ ఉన్నంత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు ముద్ద లక్ష్మీనారాయణ, మందలపు కోటేశ్వరరావు, వెంకటేశ్వర నాయక్, శాలువాలతో సత్కరించారు.

చిలకచర్లలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని ఎగువ చెర్లోపల్లి, చిలకచర్ల గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మిరప పంటను పరిశీలించారు. మిరప పంటలో కొమ్మ ఎండు తెగులును గుర్తించారు. విత్త ఉత్పత్తి కోసం సాగు చేసే మొక్కజొన్న పంటను కంపెనీ వారి వద్ద నుండి తప్పనిసరిగా అగ్రిమెంట్ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి జవహర్ లాల్ నాయక్, ఏఈవో చైతన్య కుమార్, విఎస్‌ఏ షెడ్రాక్ బాబు పాల్గొన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బాపట్ల

వాయుసేన విన్యాసాల్లో భాగంగా బాపట్ల సూర్యలంక కేంద్రంగా గాలి నుంచి ఉపరితల ఫైరింగ్‌ను ఎమ్ఐ-17 వి-5 హెలికాప్టర్‌ని ఉపయోగించి ఈ నెల 8 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఫైరింగ్ 50 కిలోమీటర్ల పరిధిలో ఉంటుందని జిల్లా మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ఈ సమయంలో జిల్లాలోని మత్స్యకారులందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు



కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని కేశవరాజు కుంట ప్రాంతంలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శానిటేషన్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం ఆయన కేశవరాజుకుంట ప్రాంతం లో పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగు తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. మురుగు కాల్వలను, ఖచ్చా కాలువను పరిశీలించారు. కాల్వలను ప్రతిరోజూ శుభ్రం చేయించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి రోజు చెత్త సేకరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. దోమలు నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో ఐదు రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. కమిషనర్ వెంట శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

శ్మశానవాటికకు రహదారి పనులు ప్రారంభం



జంగిల్ క్లియర్స్‌ను చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని పాత గోళ్లవిడిపి గ్రామానికి చెందిన మాల హరిజనులకు సంబంధించిన శ్మశానవాటికకు రహదారి లేదు. శ్మశాన వాటికంతా ముళ్ల చెట్లు పెరిగాయి. దహన సంస్కారాలు నిర్వహించేందుకు మృతదేహాలను తీసుకెళ్లే సమయంలోనూ తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ పరిస్థితి గత 35 సంవత్సరాలుగా పట్టి పీడిస్తోంది. అయితే ఎట్టకేలకు యర్రగొండపాలెం మండల పరిషత్ నుంచి శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.ఐదు లక్షలు మంజూరు చేశారు. దీంతో బుధవారం వైస్ ఎంపిపి ఊనాది బాలమ్మ ఆధ్వర్యంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ శ్మశాన వాటికలో ముళ్ల చెట్లను తొలగించనున్నట్లు తెలిపారు. ఆ ప్రదేశాన్ని రాళ్ల, రప్పలు లేకుండా శుభ్రం చేయించనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో బుర్రయ్య వాగుపై చిన్న బ్రిడ్జిని నిర్మించి ఆ తర్వాత మట్టి రోడ్డును నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేసి హరిజన వాడ మాల కులస్తులకు సంబంధించిన శ్మశాన వాటికను సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సామాజిక స్పృహ కలిగి ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ సమగ్ర వైద్యశాల నందు విద్యార్థులచే శ్రమదానం నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం తొలగించారు. పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వీర రాఘవయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం మంచి విషయమని పేర్కొన్నారు. సామాజిక కార్యక్రమాలపై యువతకు తర్ఫీదు ఇవ్వడమే గాక, వారి సేవలు వినియోగించు కోవడం ఎన్ఎస్ఎస్‌లో కనిపిస్తుందని అన్నారు. విద్యార్థులే ఉత్తమ సమాజ నిర్మాతలని అన్నారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా ఇతర రంగాల్లో రాణిస్తేనే వ్యక్తిత్వ వికాసం సాధ్యమని అన్నారు. దీనికి అనుగుణంగా విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం చేసిన కృషి సత్ఫలితాలిస్తోందని అన్నారు. విద్యార్థులు శ్రమదానంతో పరిసరాలు శుభ్రంగా ఉంచటం ప్రజలను సమాజ సేవ పట్ల చైతన్య పర్చటంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల కృషి వెలకట్టలేనిదని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం దాసు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న కార్యదర్శి డి శ్రీనివాసరావు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని పేటేరు పంచాయతీలో పారిశుధ్యం, పరిశుభ్రత, పరిరక్షణలో భాగంగా పంచాయితీ కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్య కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వీధులకు ఇరువైపులా వున్న చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. పాఠశాల ఆవరణ, అంగన్వాడీ కేంద్రం, పల్లె ప్రకృతి వనంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు. గ్రామంలో తడి, పొడి చెత్త నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి పొడి చెత్తను, తడి చెత్తను వేరు చేసి తడి చెత్త ద్వారా కంపోస్ట్ ఎరువు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పంచాయతీ పారిశుధ్యంలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి కనపర్తి వసుమతి, మాజీ సర్పంచులు శాస్త్రి, గోలి రామ శేషగిరిరావు, మాజీ ఉప సర్పంచ్ ఆరేపల్లి వీరబాబు, ఆరేపల్లి నాగరాజు, కనపర్తి రవి కిరణ్ పాల్గొన్నారు.

పరుగు పోటీల్లో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - బాపట్ల



ఇమామ్

గుంటూరులో ఇటీవల జరిగిన సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ పరుగు పోటీల్లో పురపాలక సంఘం రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఇమామ్ మొదటి స్థానంలో నిలిచినట్లు మున్సిపల్ ఆర్ఓ జబ్బార్ బుధవారం తెలిపారు. 1500 మీటర్ల పరుగు పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన ఇమామ్ జాతీయ సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ నేషనల్ మీట్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ



సబ్సిడీపై సెనగలు పంపిణీ పరిశీలిస్తున్న ఎఒ సుబ్బారెడ్డి



కార్యక్రమంలో అద్దంకి ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ

ప్రజాశక్తి - పంగులూరు

సబ్సిడీ రేట్లపై సెనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఎ.ఒ డి సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని కోటపాడు రైతు సేవ కేంద్రంలో 20శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 2024-25 రబీకి సంబంధిం చి జేజీ-11 రకం 862 క్వింటాళ్లు, కాక్ -2 రకం 900 క్వింటాళ్లు మంజూరైనట్లు చెప్పారు. 25 శాతం సబ్సిడీపై రైతులకు అందించనున్నట్లు తెలిపారు. జేజీ-11 రకం శనగ విత్తనాలు క్వింటా రూ.9,400 కాగా 25శాతం సబ్సిడీ రూ.2,350 రాయితీ పోను రూ.7,050లకు చెల్లించాలని, కాక్-2 రకం శనగ విత్తనాలు క్వింటా రూ.12,100 కాగా సబ్సిడీ 25శాతం రూ.3,025 రాయితీ పోను రూ.9,075 చెల్లించి రైతులు తీసుకెళ్లాలని అన్నారు. ఈ 25శాతం రాయితీ విత్తనాలు ఎకరాకు 40కేజీల చొప్పున గరిష్ఠంగా ఐదెకరాలకు రెండు క్వింటాళ్లు ఒక రైతుకు సరఫరా చేస్తామని చెప్పారు.

అద్దంకి : మొక్కజొన్నలో కత్తెర పురుగుపై అప్రమత్తంగా ఉండాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. పట్టణంలోని దామావారిపాలెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొక్కజొన్నలో అక్కడక్కడ నష్టపర్చడం గమనించానని తెలిపారు. దీని నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 5శాతం ఎస్జి 0.5 ఎంఎల్, లేదా స్పైనోశాడ్ 45శాతం ఎస్సి 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిఎ పాలడుగు శేషారావు, ఎఇఒ కోటేశ్వరరావు, దామా శ్రీనివాసరావు, దామా వెంకటరావు పాల్గొన్నారు.

కర్లపాలెం : రబీ కాలం నుండి పంటల భీమా రైతులు చెల్లించి పంటలకు నష్టం వాటిల్లినప్పుడు భీమా చెల్లిస్తారని ఎడిఎ లక్ష్మీ తెలిపారు. మండలంలోని సమ్మెటవారిపాలెం, పెదగొల్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డిఎవో ఎం విజయనిర్మల, ఎడిఎ ఎ లక్ష్మి రైతులకు వ్యవసాయంలో మెళకువలు వివరించారు. వ్యవసాయ యంత్ర పరికరాలను అతి త్వరలో ప్రభుత్వం సబ్సిడీలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో పురుగు, తెగుళ్ళ చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. డిఏవి విజయనిర్మల మాట్లాడుతూ వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ నేల బలంగా ఉండటానికి ఘనజీవామృతం తయారీ విధానం, పురుగు నివారణకు నీమాస్త్రం కషాయం దాని తయారీ విధానం వివరించారు.

అమృతలూరు : మండలంలోని బోడపాడు, ప్యాపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ ఉయ్యూరు లోకేశ్వరి మాట్లాడుతూ వరి పంట కంటి దశలో ఉందని అన్నారు. వరికి పాము పొడ, మెడ విరుపు తెగులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పైరును పరిశీలించుకొని తెగులు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పాము పొడ నివారణకు టిల్ట్ మందులు ఎకరాకు 200 గ్రాములు చొప్పున, అగ్గి తెగులు నివారణకు బీమ్ 120 గ్రాములు చొప్పున పిచికారి చేసుకోవాలని చెప్పారు. రబీ సీజన్‌లో అపరాల రైతులు భీమా చేయించుకోవాలని సూచించారు. రైతు సేవ కేంద్రాలు, మీ సేవ కేంద్రాల్లో ఆధార్ కార్డు, పొలం పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంటుతో భీమా చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. మినుములో కలుపు, బంగారు తీగ నిర్మూలనకు తగిన సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఇఒ శ్రీకాంత్, బోడపాడు ఉపసర్పంచి అశోక్ కుమార్ పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎడిఎ లక్ష్మి



బోడపాడులో రైతులతో మాట్లాడుతున్న ఎఒ లోకేశ్వరి

అక్షరాస్యులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కర్లపాలెం

మహిళను అక్షరాశ్యులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సమైఖ్య ఆధ్వర్యంలో ఉల్లాస్ (అడల్ట్ ఎడ్యుకేషన్)పై వాలంటరీ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు చదవడం, రాయడం రాని వారికి ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాలు నేర్పించడానికి మహిళా సంఘాల్లో అక్షరాస్యత లేని వారిని గుర్తించి 10 మందికి టెన్త్ క్లాస్ చదివిన ఒక మహిళను వాలంటీర్ టీచరుగా నియమించినట్లు తెలిపారు. ఈ వాలంటీర్లకు శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రతి మహిళకు చదవడం, రాయడంతోపాటు, డిజిటల్ శిక్షణ, ఫైనాన్షియల్ లిటరసీ, లీగల్ లిటరసీపై పూర్తి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎస్ఐ రవీందర్ మాట్లాడుతూ మహిళలు అక్షరాస్యత కలిగి ఉన్నప్పుడే ప్రభుత్వం కల్పించే మహిళా చట్టాలు సక్రమంగా వినియోగించుకుని వారిని వారు రక్షించుకోగలుగుతారని అన్నారు. బాల్య వివాహాలు ఆరికట్టడంలో అక్షరాస్యత కలిగిన తల్లికి మాత్రమే సాధ్యమని అన్నారు. ఉల్లాస్ ద్వారా గృహహింస 2005, వరకట్నం నిషేధం 1961, లైంగిక వేధింపుల నిరోధక చట్టం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

2013, మాతృ యోజన 19 61, 2017 సవరణతో పిఒపిఎస్ఒ 2012, లైంగిక వేధింపులు నిరోధక చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం నేటి మహిళకు ఎంతైనా ఉందని అన్నారు. ఆర్థిక స్వావలంభన కలిగిన మహిళకు ఆర్థిక మోసాలపై అవగాహన ఉండాలని వివరించారు. కార్యక్రమంలో తహశీల్దారు సుందరమ్మ, జడ్పిటిసి పిట్ల వేణుగోపాలరెడ్డి, ఎపిఎం శ్రీనివాసరెడ్డి, ఈఒపిఆర్డి శ్రీనివాసరావు, ఎపిఎం ఎన్ శ్రీనివాసులురెడ్డి, సిసిలు రాఘవులు, శివకోటేశ్వరరావు, శివప్రభ, అకౌంటెంట్ లక్ష్మి పాల్గొన్నారు.



మహిళా కార్మికులను పరామర్శిస్తున్న మోపిదేవి

మోపిదేవి పరామర్శ

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక గోకర్ణమఠంలోని రాయల్ మెరైన్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఇటీవల విషవాయువులు లీకైన ప్రమాదంలో అస్వస్థతకు గురై కోలుకున్న మహిళా కార్మికులను మాజీ ఎంపీ, టీడీపీ నేత మోపిదేవి వెంకటరమణరావు బుధవారం పరామర్శించారు. కంపెనీని సందర్శించారు. ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా కార్మికులకు జరిగిన సంఘటన బాధాకరమని అన్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామానికి చెందిన మహమ్మద్ జైనుల్లా సతీమణి మహఫీరా (52) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయన వెంట ఎంపిపి మోపిదేవి హరినాథ్ బాబు, ప్రసాదం వాసుదేవ, బోట్లు యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఉన్నవ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఉప సర్పంచ్ మార్కండేయులు, ఎంపిటిసి నాజర్ ఖాన్, రొయ్యల కంపెనీ యాజమాన్యం పాల్గొన్నారు.



బెల్లం ఊట ధ్వంసం చేసిన ఎక్సైజ్ అధికారులు

నాటు సారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని స్తువర్టుపురంలో నాటు సారాయి స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. నాటు సారాయి తయారీకి ఉపయోగించే 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి గీతిక తెలిపారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె విజయ ఆదేశాల మేరకు స్తువర్టుపురం ప్రాంతంలో నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ డి ప్రభుదాస్, ఎస్ మౌనిక, ఒంగోలు ఎన్‌ఫోర్స్ మెంట్ ఎస్ఐ పి రాజేంద్రప్రసాద్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం

ప్రజాశక్తి - నిజాంపట్నం

నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మి అన్నారు. ఎంపిక చేసిన వయోజన విద్య వాలంటీర్లకు స్థానిక స్త్రీ శక్తి కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. మహిళా వాలంటీర్లు అందరూ సమన్వయం చేసుకొని నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. నిరక్షరాస్యులను ఏ విధంగా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి, ఎలా నిరక్షరాస్యులను గుర్తించాలి, వారికి ఎలా శిక్షణ ఇవ్వాలనే అంశంపై ఎపిఎం డి మస్తానరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ బి జ్యోతిలక్ష్మి, సిసిలు జి శేషగిరిరావు, జి శేషావతారం, కె గాంధీ, అకౌంటెంట్ డి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, విఒఎలు పాల్గొన్నారు.

నేరస్తులకు శిక్ష పడితేనే బాధితులకు న్యాయం

◆ హత్యాయత్నం కేసులో 6 గురుకి జైలు శిక్ష ◆ 4 గురికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఇద్దరికి ఏడాది సాధారణ శిక్ష ◆ కోర్టు మానిటరింగ్‌ను అభినందించిన ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి - చీరాల

నేరం చేసిన వ్యక్తికి కోర్టులో శిక్ష పడినప్పుడే బాధితుడికి న్యాయం చేసినట్లని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. చీరాల ఒకటో పట్టణ స్టేషన్ పరిధిలో 2017లో జరిగిన హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితులకు అసిస్టెంట్ సేషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం సుధా జైలుశిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. 2017 జులై 14న స్థానిక ముంతావారి సెంటర్లో ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తూ ఉండగా థామస్‌పేటకు చెందిన బోనిగల శ్యాంబాబు అతను హీరో ఆక్టివ బండిపై వస్తుండగా అతనిని అనుసరిస్తూ ఎపి16ఎఎస్1119 నెంబరు గల మోటార్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు శ్యాంబాబు బండి వెనుకగా వచ్చి మోటార్ సైకిల్ వెనుక కుర్చుని ఉన్న వ్యక్తి శ్యాంబాబును తన చేతిలో ఉన్న ఇనుప రాడ్డుతో తలపై కొట్టగా శ్యాంబాబు బండితో సహా క్రింద పడ్డాడు. దీంతో ముద్దాయిలు బండి దిగి దూర్భాషలు ఆడుతూ వారివద్ద ఉన్న కత్తులతో శ్యాంబాబు గుండెల్లో పొడిచారు. అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న హెూంగార్డ్ కె వెంకటేశ్వర్లు పెద్దగా కేకలు వేయగా నిందితులు మోటార్ సైకిల్ వదిలి పారిపోయారు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించగా పోలీస్ సిబ్బంది వచ్చి గాయపడిన శ్యాంబాబును చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. హెూంగార్డ్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన రిపోర్ట్ మేరకు అప్పటి సిఐ వి సూర్యనారాయణ ఐపిసి సెక్షన్ 141/2017 యు / ఎస్, 307 ఆర్ / డబ్ల్యూ 34 కేసు నమోదు చేశారు. ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వాంగ్మూలం ఆధారంగా ముద్దాయిలను గుర్తించారు. వారు నేరం చేసినట్లు రుజువు చేసి, అరెస్ట్ చేసి సంబంధిత కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసులో ముద్దాయిలైన జాన్‌పేటకు చెందిన ఎ1 జొన్నలగడ్డ ప్రభుదాసు, ఎ2 జొన్నలగడ్డ అశోక్ కుమార్, ఎ3 ఉప్పు రమేష్, ఎ4 సాతినేని శివపార్వతి, శ్రీనివాసనగర్‌కు చెందిన ఎ5 దేవిశెట్టి మస్తానరావు, కొండేపి మండలం పెట్లూరుకు చెందిన ఎ6 అరతోటి ప్రసాద్ అనే ఆరుగురు ముద్దాయిలకు జైలు శిక్ష విధించారు. వీరిలో నలుగురికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధించగా మరో ఇద్దరికి ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ముద్దాయిలకు జైలు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకున్న వన్‌టౌన్ సిఐ ఎం శ్రీనివాసరావు పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ ఎ నీలకంఠారెడ్డి ఎస్పీ అభినందించారు.



బాపట్ల ఎస్పీ తుషార్ డూడి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొమ్మలపాడు వద్ద అద్దంకి బ్రాంచ్ కెనాల్ సమీపంలో అద్దంకి – నార్కెట్‌పల్లి రహదారి పై అడ్డరోడ్డు నుండి అద్దంకి వైపు వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొనడంతో ఆటో నడుపుతున్న వ్యక్తికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఏల్చూరు ఎస్సీ కాలనీకి చెందిన మందా ఇసాక్‌గా గుర్తించారు. ఆటో ముందు భాగం నుజ్జు నుజ్జయ్యింది. ఇసాకు కొమ్మాలపాడు సమీపంలో ఆటోతో పొలం వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఎదురుగా వచ్చే లారీ ఢీకొంది. క్షత గాత్రుడిని నామ్ హైవే అంబులెన్స్ ద్వారా నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్యదర్శి నాగజ్యోతి

పశు గణన గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని వింజనంపాడు పంచాయతీ కార్యాలయం నందు పశు గణన గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగ జ్యోతి, పోలూరు వెటనరి అసిస్టెంట్, గ్రామ ఉప సర్పంచ్ రంగారావు, వజ్జా వీరయ్య, మహిళలు పాల్గొన్నారు.



వీర్యం ద్వారా లింగ నిర్ధారిత పుట్టిన దూడల ప్రదర్శన

దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - కొల్లూరు

స్థానిక పశువైద్యశాలలో లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పుట్టిన దూడల ప్రదర్శన బుధవారం ఏర్పాటు చేశారు. లింగ నిర్ధారిత దూడల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి వీర్యం వలన ప్రయోజనాలను వివరించారు. ఎపి ఎల్డిఎ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు, కృషి విజ్ఞాన కేంద్రం నుండి డాక్టర్ యుగంధర్, గుంటూరు జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింహారావు, బాపట్ల జిల్లా డిఎ హెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్, చేబ్రోలు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బాలశంకర్, తెనాలి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, వెటర్నరీ హాస్పిటల్ అసిస్టెంట్ డైరెక్టర్ కెవి జనార్ధనరావు, స్థానిక పశు వైద్యులు డాక్టర్ యశ్వంత్, చలపతిరావు, శ్రీనివాసరావు, రాజేంద్ర ప్రసాద్, పారా సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మండలంలోని ఇపురుపాలెం కాల్వకట్ట, స్వర్ణ రోడ్డు కాల్వ కట్టపై నివసించే యానాదులకు 15రకాల నిత్యవసర వస్తువులు బుధవారం పంపిణీ చేశారు. డిబిఆర్సి ఏరియా కో ఆర్డినేటర్ వి భగవాన్‌దాస్ అధ్యక్షతన జరిగిన స్వర్ణ కాలువ కట్టపై జరిగిన కార్యక్రమంలో ఆర్ఐ కొణిదెల నాగ కుమార్, ఈపురుపాలెం కల్వకట్టపై తెలుగుదేశం మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం మాట్లాడారు. డిబిఆర్సి సేవలను అభినందించారు. ప్రభుత్వ ఫలాలు అందుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఆధార్, రేషన్ కార్డులు పొంది ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. బిడ్డలను విధిగా చదివించాలని చెప్పారు. బాల్య వివాహాలు చేయకూడదని సూచించారు. డిబిఆర్సి రీజినల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల సంభవించిన వరదలకు నష్టపోయిన విజయవాడ తోపాటు జిల్లాలోని లంక గ్రామాల్లో విస్తృత సేవలు అందించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న యానాదులను గుర్తించి వారికి 15రకాల నిత్యవసర వస్తువులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విఆర్ఓ వీరబాబు, ఈపూరుపాలెం పంచాయతీ సిబ్బంది జి సంజీవ్ కుమార్, వెంకటేశ్వరరెడ్డి, జి బ్రహ్మయ్య పాల్గొన్నారు.



సరుకులు పంపిణి చేస్తున్న డిబిఆర్సి ప్రతినిధులు

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు మేక శ్రీనివాసరావు హెచ్చరించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఇసుక రవాణాను నిలిపివేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక తరలించడానికి నిర్దేశించిన ఇసుక రిచ్‌ల నుండి మాత్రమే పొందాల్సి ఉందన్నారు. దీనికిగాను ముందుగా పంచాయతీలో ఈ ట్రాన్స్‌పోర్ట్ రసీదు తీసుకుని తద్వారా ట్రాక్టరుకు ఉచిత ఇసుక కొరకు అని ఫ్లెక్సీలు సిద్ధం చేసుకుని ట్రాక్టరుకు కట్టాల్సి ఉందన్నారు. దీనితోపాటు ట్రాక్టర్ యాప్ నుండి ఇసుక కొరకు నమోదు చేసుకుని తగిన రసీదును పొందిన వారు మాత్రమే ఇసుక తరలింపుకు అనుమతి ఉంటుందని అన్నారు. త్వరలో ప్రభుత్వం నుండి తగిన నివేదికలు జారీ కానున్నాయని తెలిపారు. అప్పటివరకు ఇసుక ట్రాక్టర్లకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. మండలంలోని వెల్లటూరు, పెదపులివరు, పోలేరు గ్రామాల్లో ఇసుక అక్రమ నివారణ అడ్డుకునేందుకు రెవెన్యూ సచివాలయ సిబ్బందిని షిఫ్టుల వారీగా విధుల్లో ఉంచినట్లు తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది చాలక పోతే బయట మండలాల నుండి సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు అందాయని అన్నారు. ఇప్పటికీ రెండు రోజుల క్రితం అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇప్పించి పంపించినట్లు తెలిపారు. అనుమతులు లేకపోతే ఇసుక తరలింపుకు రావద్దని సూచించారు.



పోలీసులు అదుపులోకి తీసుకున్న తీసుక ట్రాక్టర్లు

పగలు, రాత్రి విధులా?

ప్రభుత్వం నిరంతరం ఏదో ఒక నూతన యాప్‌లను ప్రవేశపెట్టి ఆ రంగాల్లో పనిచేసే ఉద్యోగులకు పనిభారాన్ని అధికం చేసింది. ప్రభుత్వ అమలు పరిచే అనేక సంక్షేమ పథకాలను ఈ సిబ్బంది ద్వారా ప్రజలకు చేరవేర్చాల్సి ఉంది. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు విధుల్లో ఉన్న ఉద్యోగులు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి అలసట నుండి సేద తీరుతారు. మురుసటి రోజు యధావిధిగా విధులకు వచ్చేందుకు సిద్ధపడతారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగులకు అదనంగా ఇసుకరీచులకు ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో విధులు కేటాయించడం వలన మరింత పని భారం పెరిగి తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. రెవిన్యూ వ్యవస్థలో పనిచేసే విఆర్ఒలు, విఆర్ఎలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పగటిపూట విధులు నిర్వహించి తిరిగి రాత్రి 10 గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు విధులు కేటాయించడం ఏమిటని వాపోతున్నారు. ప్రభుత్వం ఈ విధానంపై పునరాలోచించాలని కోరుతున్నారు.

గంగవరం మెడికల్ క్యాంపు తేదీ మార్పు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని గంగవరంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి రెగ్యులరగ్ జరిగే మెడికల్ క్యాంపు తేదీ మార్చినట్లు కన్వీనర్ బాలచంద్ర తెలిపారు. రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఈనెల 17న ఉదయం 6 గంటల నుండి 12 గంటల వరకు గంగవరంలోని మంచాల వెంకటరామయ్య, రంగమ్మ విద్యా వైజ్ఞానిక కళ్యాణ మండపంలో జరుగుతుందని తెలిపారు. డాక్టర్ మంచాల రమేష్ కుమార్, డాక్టర్ ఎ సాంబయ్య వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. 10వ తేదీ జరగాల్సిన క్యాంపు అనివార్య కారణాలతో 17కు మార్చినట్లు తెలిపారు. తేదీ మార్పును గమనించాలని కోరారు. వైద్య శిబిరానికి డాక్టర్ బోడింపూడి ప్రకాశరావు, సీతారావమ్మ స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. గంగవరం పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎఓ రామ్మోహన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పర్చూరు

మండల వ్యవసాయాధికారిగా ఎస్ రామ్మోహన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతేడాది జాతీయ ఆహార భద్రతా మిషన్ సబ్సిడీ శనగలు నిధుల దుర్వినియోగం ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. ప్రస్తుతం వ్యవసాయ కమీషనర్ ఆదేశాల మేరకు ఎఓగా నియమితులయ్యారు.



నూర్ భాషా మహిళలకు రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు

మండల కేంద్రమైన పంగులూరులో వృద్ధ మహిళలు, వితంతు మహిళలు, వికలాంగ మహిళలకు రగ్గులు పంపిణీ చేశారు. కార్తీక మాసం సందర్భంగా క్విజ్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు నిడమానూరి నాగేశ్వరరావు సతీమణి చెంచులక్ష్మి, ఆమె సోదరుడు మాజీ జెడ్పిటిసి బాచిన చెంచు ప్రసాద్, శివకుమారి దంపతులతో కలసి 57మంది నూర్ భాషా మహిళలకు రూ.30వేల విలువైన రగ్గులు పంపిణీ చేశారు. ఆనున్న చలి కాలంలో ఎంతో ఉపయోగంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో నూర్ భాషా ప్రతినిధులు నందవరపు, రామాంజనేయులు, వీరాంజనేయులు, పోతుగంటి అజిషా, పీర్ సాహెబ్, నూర్ భాషా మహిళలు పాల్గొన్నారు.

జనసేన కార్యదర్శులుగా కేశవ, బాలకృష్ణ

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం జనసేన ప్రధాన కార్యదర్శిగా మోదుకూరు గ్రామానికి చెందిన పద్యాల కేశవ, కార్యదర్శిగా వడ్రాణం బాలకృష్ణను నియమించినట్లు జిల్లా నాయకులు ఇక్కుర్తి శ్రీనివాసరావు తెలిపారు. అధ్యక్షులు అమ్మిశెట్టి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి నియామకం చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన ఇరువురికి సీనియర్ నాయకులు శ్రీనివాసరావు చేతుల మీదగా నియామక పత్రం అంద చేశారు. పద్యాల కేశవ, వడ్రాణం బాలకృష్ణ నిబద్ధత కలిగిన కార్యకర్తలని అన్నారు. జనసేన బలోపేతానికి కృషి చేయాలని కోరారు. గ్రామీణ స్థాయి నుండి పార్టీ విస్తరణకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. పార్టీ బాగుంటేనే కార్యకర్తలూ బాగుంటారని అన్నారు. జనసేన ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ పార్టీ బాగుంటే కార్యకర్తలు అందరూ బాగుంటారని అన్నారు. కార్యక్రమంలో శీను, మోదుకూరు జన సైనికులు పాల్గొన్నారు.

రుచికరంగా పౌష్టికాహారం అందించాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల

అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ సంక్షేమ వసతి గహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం రుచికరంగా అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం బాపట్ల మండలంలో పలు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వ వసతి గహాల్లో విద్యార్థులు అందించే ఆహారాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా వసతి గహాలకు అంగన్వాడీ కేంద్రాలకు అందించే ఆహార పదార్థాలను సక్రమంగా చిన్నారులకు విద్యార్థులకు వండి వడ్డించాలన్నారు. పేదవారి ఆకలి తెచ్చేందుకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదార వంటి నిత్యావసర వస్తువులు అందించడం జరుగుతుందన్నారు. వసతి గహాల్లో ఐదో తరగతి లోపు ప్రీమెట్రిక్ విద్యార్థులకు రూ.1400, ఆరో తరగతి ఆపైపోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు రూ.1600 ప్రభుత్వం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా డొక్కా సీతమ్మ భోజన పథకం పేరు మార్పు చేసి నిర్వహిస్తుందన్నారు. వంట వారికి రూ.3 వేలు ప్రతి నెలా జీతం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.5.88 పైసలు, ఆరో తరగతి ఆపై విద్యార్థులకు రూ.8 అందజేస్తున్నారని చెప్పారు. కూరగాయల ఖర్చులు, ఈ మొత్తాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా బియ్యం రాగి మాల్ట్, చిక్కిలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రధానమంత్రి మాత వందనం పథకం ద్వారా తొలి కాన్పు బాలింతలకు రూ.5 వేలు, రెండో కాన్పుకు రూ.6 వేల పారితోషికం అందజేయడం జరుగుతుందన్నారు. తొలుత జిల్లా కలెక్టర్‌ను విజయప్రతాపరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట సివిల్ సప్లై అధికారులు ఉన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

అర్హులందరికీ

సంక్షేమ పథకాలు అందాలి..

కలెక్టర్ జె.వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఆధార్, రేషన్ కార్డుల మంజూరుపై మండల తహశీల్దార్లతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుండి ఆయన వీక్షణ సమావేశం నిర్వహిం చారు. ఆధార్ కార్డులు లేక ఎస్టీలు నష్టపోతు న్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని జనన, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన వారందరికీ చేరవేయడమే లక్ష్యంగా అధి కారులు పనిచేయాలని ఆయన పలు సూచ నలు చేశారు ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీవో పి గ్లోరియా, తహశీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

డిఆర్ఒగా గంగాధర్ గౌడ్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా నూతన రెవెన్యూ అధికారిగా జి.గంగాధర్ గౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు డిఆర్‌వోగా ఉన్న సత్తిబాబు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళిని నూతన డిఆర్‌వో గంగాధర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

– డిఆర్‌వో గంగాధర్‌గౌడ్‌ను బాపట్ల ఆర్‌డిఒ గ్లోరియా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిఆర్ఒ

మహిళలు అక్షరాస్యులు కావాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని మండల సమైక్య భవనంలో బుధవారం ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అభివద్ధి అధికారి నాసర్‌రెడ్డి మాట్లాడుతూ ఉల్లాస్ శిక్షణ గురించి ప్రతి ఒక్క మహిళ ఆర్థికంగా ప్రభుత్వ పథకాలు అందుకొని అందులో భాగంగా ప్రతి మహిళ నిరక్షరాస్యత నుండి అక్షరాస్యత వైపు మరలాలని కోరారు. ఈ సందర్భంగా వయోజన విద్య సూపర్ వైజర్ కన్నెబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అక్షరాస్యతతో పాటు సామాజిక అభివద్ధి వైపు మరియు ఆర్థిక అక్షరాస్యత వైపు మరలాలని కోరారు. సమావేశంలో ఏపిఎం దర్శనం పోలయ్య, సీసీలు ఆశీర్వాదం, శ్రీను, సంఘ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ఎస్‌హెచ్‌సిలు కృషి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి
- స్వయం సహాయక సభ్యులను కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మహిళా సాధికారతకు స్వయం సహాయక సంఘాలు ఇతోధికంగా కృషి చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ యాప్ నిర్వహణ పై నిర్వహించిన జిల్లా స్థాయి వర్క్ షాప్ ల్లో కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ మహిళా సాధికారతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంభన దిశగా అడుగులు వేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. తద్వారా మహిళా సాధికారతకు కషి చేయాలన్నారు. ప్రతి బాలిక కచ్చితంగా చదువుకొనేలా స్వయం సహాయక సంఘాల సభ్యులు కషి చేయడంతో పాటు సామాజిక మార్పుకు కషి చేయాలన్నారు. జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమం ద్వారా 0 నుండి 18 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు ముఖ్యంగా బాలికలపై దష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టడానికి క్యాంపెయిన్ చేయబోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రతి స్వయం సహాయక సంఘలా సభ్యులు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కొత్త యాప్ ను తీసుకొచ్చిందని, ఈ యాప్ లో స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక, సామాజిక పరమైన సమగ్ర డేటా ను నమోదు చేస్తారన్నారు. ఈ యాప్ నిర్వహణపై ఇస్తున్న శిక్షణా కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి స్వయం సహాయక సంఘం సభ్యులు క్షుణ్ణంగా అర్థం చేసుకొని సమగ్ర డేటా నమోదుకు కషిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ యాప్ జనవరి నెలలో అందుబాటులో రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. రవి కుమార్, ఏఒ వినీల్, టెక్నికల్ సిబ్బంది ఫణి కుమారి, సంతోష్ కుమార్, జయకుమార్, కల్పన, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కృషి

- పండించిన పంటకు గిట్టుబాటు ధరలు
- ముందస్తు కార్యాచరణ ప్రణాళికకు సిద్ధం
- అధికారులకు జేసీ గోపాలకృష్ణ ఆదేశం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జెసి రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్ల పై మార్కెటింగ్, పౌర సరఫరాలు, వ్యవసాయ, ట్రాన్స్ పోర్టు, మార్కెటింగ్, కోపరేటివ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 రబీ సీజన్‌లో వ్యవసాయ శాఖ వారి అంచనాల ప్రకారం 59,547 మెట్రిక్ టన్నుల ధాన్యం, 61, 583 మెట్రిక్ టన్నుల కంది పంట ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందన్నారు. , ఈ మేరకు జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రబీ సీజన్ లో ఉత్పత్తి అయిన పంటను కొనుగోలు చేసేందుకు అధికారులు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. ఇందుకు సంబంధించి టెక్నికల్ అసిస్టెంట్లు, విఏవోలు ఇతర సిబ్బందిని ఏర్పాటు చేసుకొనేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా పక్కా ప్రణాళికతో గన్నీ బ్యాగ్స్, హామాలీలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, ముందుగానే సిద్ధం చేయాలన్నారు. గన్నీ బ్యాగ్స్ సమస్య తలెత్తకుండా ముందుగానే ఎన్ని అవసరమో నిర్ధారించి, సిద్ధం చేయాలన్నారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి సేకరణ కమిటీల ఏర్పాటు తో పాటు సంబంధిత కమిటీ ల సమావేశాల షెడ్యూల్ ను రూపొందించి నెలాఖరు నాటికి అన్నీ స్థాయిలో కమిటీల సమావేశాలు జరిగేలా చర్యలు చేపట్టాలని జెసి డిఎస్ఒ పద్మశ్రీని ఆదేశించారు. సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీఓ లు కె.లక్ష్మి ప్రసన్న, కేశవర్ధన్ రెడ్డి, డిఎస్ఒ పద్మశ్రీ, డిటిసి ఆర్.సుశీల, జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయ, సివిల్ సప్లై, మార్కెటింగ్, ఎఫ్‌సిఐ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యం

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల
- మెగా జాబ్ మేళా'కు విశేష స్పందన
- 1262 మంది ఉద్యోగాలకు ఎంపిక



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా మెగా జాబ్ మేళా చేపట్టి నట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు తెలిపారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు ఆధ్వర్యంలో స్థానిక ఏ1 ఫంక్షన్ హాలులో చేపట్టిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మెగా జాబ్ మేళాకు వేలాదిగా నిరుద్యోగ యువత తరలివచ్చారు. ముందుగా జాబ్ మేళాను ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల ప్రారంభించారు. షార్ప్ ఇండియా వారి సహకారంతో సుమారుగా 38 కంపెనీ ప్రతినిధులు మేళాలో పాల్గొన్నారు. 3650 మంది నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన జాబ్ మేళాలో 1262 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల ఆఫర్ లెటర్ అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతోనే ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. చదువుకున్న ప్రతీ ఒక్కరూ ఏదొక ఉద్యోగం చేసుకుంటూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలన్నారు. ఎక్కువ సంఖ్యలో తన వద్దకు ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, దీంతో ప్రముఖ కంపెనీలతో మెగా జాబ్ మేళాను పెట్టానన్నారు. మళ్లీ 4 నెలల తర్వాత జాబ్ మేళాను ఏర్పాటు చేస్తామని, తప్పకుండా నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని దామచర్ల పిలుపునిచ్చారు. ఉద్యోగాలు పొందిన యువతీ, యువకులను ఎమ్మెల్యే దామచర్ల అభినందించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, ఎమ్మెల్యే దామచర్ల కుమార్తె అనీషా లక్ష్మి, టిడిపి నాయకులు మంత్రి శ్రీనివాసరావు, టివి శ్రీరామమూర్తి, బండారు మదన్, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, మహిళా నాయకురాళ్ళు నాళం నరసమ్మ, పెద్దిశెట్టి వరలక్ష్మి, నిడమానూరి పావని, బెజవాడ మురళి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.